
# గార్గ్యముని శిష్యులు




ఏకోదరులైన ఏడుగురు బ్రాహ్మణ యువకులు ధర్మక్షేత్రమైన కురుక్షేత్రము నుండి బయలుదేరి, 'గార్గ్యుడు' అనే మునీశ్వరుని ఆశ్రమాన్ని చేరుకొన్నారు. వారు అ సంయమంద్రునకు సాష్టాంగ పడిలేచి, "మహాత్మా, 'వాగ్దుష్టుడు', 'క్రోధనుడు', 'హింస్రుడు', 'పిశునుడు', 'కవి', 'ఖస్రముడు', 'పితృవర్తి' లమను మేము విద్యను అర్థించి వచ్చినాము. మమ్ములను శిష్యులుగా స్వీకరించి, వేద శాస్త్రాలనూ, ఉపనిషత్తులనూ వివరించి, అనుగ్రహింపుడు" అని ప్రార్థించారు. గార్గ్యయతీంద్రుడు అంగీకరించాడు.

ఆ ఆశ్రమంలో 'నందిని' అనే ఆవు ఉంది. ప్రతిదినమూ పాఠాన్ని నేర్చుకొన్న తర్వాత శిష్యులు ఏడుగురూ ఆ గోవును అడివి మధ్య పచ్చిక ఉన్న ప్రదేశానికి తీసుకుపోయి కడుపునిండా మేశాక దానిని తిరిగి పర్ణశాలకు తోలుకు వస్తుండేవారు. గురువుకు వినయ విధేయులై శుశ్రూష చేశారు. గార్గ్యుడు మహాపండితుడే కాక బోధపర్చడంలో నేర్పరి. వారు ఏకసంథాగ్రాహులు, ఒక్కసారి వింటే చాలు, నేర్వగలిగేవారు.

కొంతకాలం గడిచింది. ఆ ప్రాంతానికి భయంకరమైన కరువు సంభవించి వారికి రోజుల తరబడి తిండిలేకపోయింది. ఆవును మాత్రం రోజూ మేతకోసం ఆడవిలోకి తీసుకు వెళుతూనే ఉన్నారు. ఒకనాడు వారు ఆకలిబాధను తట్టుకోలేక అరణ్యంలో సొమ్మసిల్లిపడిపోయారు. కొంతసేపయ్యాక ఆ శిష్యులలో జ్యేష్ఠుడైన వాగ్దుష్టుడు కన్ను తెరవగా, పచ్చికను తింటూ పుష్టిగా ఉన్న ఆశ్రమ ధేనువు కనపడగానే దీనిని వధించి, ఆ మాంసాన్ని తిని ప్రాణాలు నిలబెట్టుకుంటే? అన్న ఆలోచన వచ్చింది. కడుపు చిచ్చు అంత ఘోరమైంది. వాడు తన తలంపును తమ్ములతో చెప్పాడు. ఆ సోదరులలో 'కవి' అనేవాడు 'గోవును చంపడం పాపం కాదా?" అన్నాడు. ఖస్రముడు 'ధేనువు గురువు సొత్తు. గురుద్రోహం కూడా పాపమే!' అన్నాడు. తక్కిన నల్వురూ 'కవి, ఖస్రముల మాటలను పట్టించుకోకుండా జ్యేష్ఠునితో ఏకీభవించారు. వారు ఐదుగురూ ఆవును పట్టుకొని చంపివేశారు. కవి, ఖస్రములతో "మీరు కూడా తిని ప్రాణాలను నిలుపుకొందురు గాని, రండి" అని తీసుకుపోయారు.

వారు ఆరగించడానికి సిద్ధమౌతోండగా కొందరు ఆటవికులు వచ్చి, "అయ్యలారా! మాకు కూడా కొంత మాంసాన్ని దయచేసి మా ప్రాణాలను నిలబెట్టండి" అని ప్రార్థించారు. వాగ్దుష్టుడు "మేమిప్పుడు తినగా మిగిలిన పలలాన్ని (మాంసాన్ని) రాత్రికి దాచుకోవాలి. మీకు పెట్టడానికేముంది పొండి!" అని కసురుకున్నాడు. కవి "అగ్రజా, వీళ్ల ఆకలి కూడా మనక్షుత్తువంటిదేకదా. ఈ అన్నార్తులను పొమ్మనవద్దు" అన్నాడు ఖస్రముడు. "అన్నా,



పాలంకి వెంకట రామచంద్రమూర్తి

రంతిదేవుడు జన్మించిన పుణ్యభూమి మనది. ఈ అతిథులను పొమ్మనరాదు" అన్నాడు.

వాగ్దుష్టుడింక అభ్యంతరం చెప్పక ఆ అరణ్యవాసులను కూడా తమ పంక్తిని చేర్చుకున్నాడు. వాళ్లు ఆమిషము (మాంసము)ను ఆరగించి, ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయారు.

ఆశ్రమానికి తిరిగివచ్చిన శిష్యులను గార్గ్య మహర్షి "నందిని ఏది?" అని అడిగాడు. "అరణ్యమధ్యంలో అలసట వలన మాకు కునుకు పట్టింది. లేచి చూస్తే గోవు కనబడలేదు. అడవి అంతా గాలించాము. కాని ఏమైపోయిందో తెలియలేదు" అని వాళ్లు బొంకారు. ఆయన తన దివ్యదృష్టితో జరిగినదంతా తెలిసికొని ఆగ్రహంతో "మీరింక బ్రతుకరాదు. విగతజీవులు కండు!" అని శపించాడు. ఆ ఏడుగురి ప్రాణాలూ ఎగిరిపోయాయి, శవాలు నేలకు ఒరిగిపోయాయి.

000

ఆ ఏడుగురూ మరుసటి జన్మలో దశార్ణ దేశంలో ఒక కిరాతుని ఇంట జన్మించారు. వారు గత జన్మలో పాపం చేసినా, ఆటవికుల ఆకలిని కూడా తీర్చారు కనుక ఆ పుణ్య ఫలితంగా వారికి పూర్వజన్మ స్మృహ సంక్రమించింది. "అయ్యో, వేదపారగులైన విప్రులమైయుండీ, బుద్ధిని బుగ్గి చేసుకొని, పాపానికి ఒడిగట్టాము!" అని వారు దుఃఖించారు. కిరాతులే ఐనా వేటను వర్జించి, రాలిన పర్ణములనూ ఫలములనూ మాత్రమే భుజిస్తూ అహింసావ్రతులై, ఆ జన్మను గడిపారు. తరువాత జన్మలో వారు 'కాలాండుర'మను పర్వత సానువున జింకలుగా పుట్టారు. గత జన్మల స్మృతి అనుసరించి రావడంతో ఆ మృగాలు తమ కొమ్ములతో కాని గిట్టలతో కాని అన్యప్రాణులకు ఎట్టి హానీ తలపెట్టకుండా జీవితాలను గడిపాయి. తర్వాత అవి మరుజన్మలో శరద్వీపముని చక్రవాకపక్షులుగా జననమొంది వాయు భక్షణతోనే ఆ జన్మను గడిపాయి. అనంతరం అవి మానససరోవరంలో ఏడు హంసలుగా అవతరించి, తమ హృదయ పద్మములందు పద్మనాభుని (శ్రీ మహావిష్ణువు) నిలుపుకొని తపమొనరించాయి. శ్రీ మన్నారాయణుడు ప్రత్యక్షమై "గార్గ్య శిష్యులారా, గోహత్యాపాతకం కారణంగా సంభవించిన నాలుగు నీచజన్మల యందూ మీరు పూర్వస్మృతితో పశ్చాత్తప్తులై అహింసావ్రతాన్ని పూని పాపం నుండి విముక్తులు కాగలిగారు. మీకు మానవ జన్మను తిరిగి ప్రసాదిస్తున్నాను" నరులుగా మీరు కోరుకున్న హోదాలలో జన్మించెదరు గాక" అని చెప్పి అదృశ్యుడయ్యాడు.

నరజన్మలకై నిరీక్షిస్తున్న ఆ హంసల ఆయువు చెల్లకముందే, ఒకనాడు ఆ సరోవరం వద్దకు కాంపిల్య నగరాన్ని ఏలుతున్న 'విభ్రాజుడు' అనేరాజు తన రాణులతోనూ పరివారజనంతోనూ వచ్చి, తీరమున గుడారాలను వేయించాడు. అక్కడున్న ఆ పదిరోజులూ అతడు తన అంతఃపుర కాంతలతో జలక్రీడలు సల్పుతూ నౌకావిహారం చేస్తూ, తనతో వచ్చిన ఆస్థాననర్తకుల నృత్యాలను తిలకిస్తూ, గాయకుల గానాన్ని ఆలకిస్తూ, మధుర పదార్థములనూ ఆరగిస్తూ, మధువును గ్రోలుతూ గడిపాడు.

హంసల రూపంలో ఉన్న గార్గ్య శిష్యులలోని మొదటి ముగ్గురూ (వాగ్దుష్టుడూ, క్రోధనుడూ, హింస్రుడూ) విభ్రోజుని వైభవాన్నీ, వినోదాలనూ చూసి మురిసిపోయారు! వాగ్దుష్టుడు "నాకు రాబోయే మానవజన్మలో రాజునై పుట్టి ఈ విభ్రాజుని వలెనే వినోదాలలో మునిగితేలాలి!" అన్నాడు. క్రోధనుడు "అన్నా, నీవు రాజుగా పుడితే నేను నీ ప్రధానమంత్రిగా జన్మించాలి" అన్నాడు. హింస్రుడు "అగ్రజులారా, నేను ఉపప్రధానిగా ఉద్భవించి, మీ జల్సా జీవితంలో నేనూ పాలు పంచుకోవాలి" అన్నాడు.

ఆ ముగ్గురు అన్నలూ వెల్లడించిన కోర్కెలను విన్న నల్గురు తమ్ముళ్లు నిర్ఘాంతపోయారు. "ఉత్కృష్టమైన మానవజన్మను మరల పొందబోతూ క్షుద్రమైన విలాసములతో వృధా చేసుకొనుటకా?" అని వారు వాపోయారు. "మనం గార్గ్యమహాముని ఛాత్రులమైయున్నప్పుడు "శరీరమాద్యంఖలు ధర్మసాధనం" అని నేర్చాము కాని మన శరీరాలను అధర్మసాధనాలుగా చేసికొని గోహత్యకు పాల్పడ్డాము. ఆ మహాపాపఫలితంగా నాలుగు నీచ జన్మలకు లోనయ్యాము! ఇప్పుడు మనకు మానవ జన్మ మన అదృష్టం కొద్దీ తిరిగి లభిస్తోంది. ఈ జన్మను సఫలం చేసుకోడానికి సత్యశౌచములనూ అభిలషించాలి కాని మధుపానాది వ్యసనములూ ఇంద్రియలోలత్వమూ కాదు" అన్నారు. వాగ్దుష్టుడు చిరాకుగా "ఇప్పుడు గోవధ ప్రసక్తి దేనికి? వినోదభరిత జీవితాన్ని వాంఛించడం నేరం కాదు. మీరు హర్షించనిచో మమ్ము అనుసరించనక్కరలేదు. మీ దారిని మీరు పోవచ్చు!" అన్నాడు. వారు అగ్రజుని అవివేకానికి విచారిస్తూ, "సరే, అట్లే పోయెదము" అన్నారు.

000

హంసలు కాలధర్మ చెందాయి. నరజన్మలను పొందాయి. రాజుగా పుట్టాలని కోరుకున్న వాగ్దుష్టుడు కాంపిల్య నగరానికి పాలకుడై 'బ్రహ్మదత్తుడు' అనే పేరుతో పిలవబడినాడు. అతని తరువాతి వారిరువురూ బ్రహ్మదత్తునకు మంత్రులయ్యారు. వారి తమ్ముళ్లు ఆ నగరములో 'విద్యానిధి' అనే ఒక నిరుపేద విప్రుని ఇంట కుమారులుగా జన్మించారు.

బిడ్డలతండ్రియై ఆ బిడ్డలు పెరిగి పెద్దవాళ్లయ్యాక కూడా బ్రహ్మదత్తునకు భోగలాలసత్వం పోలేదు. పరిచారికలు అందించే మధ్యాన్ని తాగుతూ, పొద్దస్తమానం నర్తకజనంతో జూదరబృందంతో కాలాన్ని దుర్వినియోగం చేసేవాడు. మంత్రులిద్దరూ కూడా వ్యసనపరులే కనుక ఆతణ్ణి ప్రజాహిత కార్యాల వైపు మళ్లించలేకపోయారు.

ఒకనాడాతడు పట్టమహిషి సన్నుతీదేవితో ముచ్చటిస్తుండగా ఆమె హఠాత్తుగా వేదిక ముందున్న నేలవైపు తన దృష్టిని సారించి పకపక నవ్వింది.

రాజు: ప్రాణేశ్వరీ, నీ ఆకస్మిక హాస్యానికి కారణం ఏమిటి?

రాణి: ఈ వేదిక ముందు రెండు చీమలు చేరి మాట్లాడుకుంటున్నాయి, మహారాజా. వాటి సంభాషణ నాకు నవ్వును రప్పించింది.

రాజు: నీకు చీమల భాష వచ్చా ఐతే?

రాణి: వచ్చు ప్రభూ. నా బాల్యంలో మా భవనానికి సర్వజ్ఞుడైన సిద్ధుడొకడు వచ్చాడు. ఆయన వాత్సల్యంతో నాకు పిపీలకభాషను నేర్పాడు. ఇప్పుడిక్కడ ఈ మగచీమ ఆడచీమతో ఏమన్నదో వినండి. 'ప్రేయసీ, నీవు ఊర్వశి కన్నా అందమైనదానవు. రంభా, మేనకా తిలోత్తమా వీరంతా నీ చక్కదనం ముందు లొక్కే! అని ప్రశంసించింది. ఆ పొగడ్తకు ఆడచీమ పొంగిపోలేదు... అది ఏమన్నదో చెపితే మీకు కోపం రావచ్చు.

రాజు: మధ్య నాకెందుకు కోపం? ఆడచీమ ఏమన్నదో చెప్పు. చెప్పకపోతే నా మీద ఒట్టు!

రాణి: ఐతే వినండి. ఆడచీమ ఇలా అన్నది. ప్రియుడా, నీవీ బ్రహ్మదత్త భూపతివలె భోగలాలసుడవై నీ విధులను విస్మరిస్తే ఎలా? నన్ను పొగుడుతూ జాప్యం చేయక, పోయి ఆహారపదార్థాలను తీసుకురా. వండి వస్తాను" అన్నది.

'కోపం రాదు' అన్నాడు కాని రాజుకు కోపం పొంగి వచ్చింది. 'చీమ కింత పొగరా? ఏదీ, ఎక్కడ? నా చడావుతో తొక్కి చంపివేస్తాను!" అంటూ లేచాడు.

రాణి అడ్డు వచ్చి "క్షమించండి ప్రభూ. ఈ అల్పప్రాణిని చంపకండి" అన్నది... అతడు శాంతించి యోచించసాగాడు. 'నిష్ఠూరమైనా నిజాన్ని చెప్పి నాకు జ్ఞానోదయాన్ని కలిగించింది, పిపీలికం!' అనుకున్నాడు. అతని మత్తు వదిలిపోయింది. ప్రవర్తనలో పరివర్తనం కలిగింది. రాజుగా అతడు తన విధులకు, హాజరు కావడం ప్రారంభించాడు.

ఒకనాడు బ్రహ్మదత్తుడు సింహాసనాసీనుడై యుండగా, ఒక వృద్ధ బ్రాహ్మణుడు కొలువును ప్రవేశించాడు. "రాజా, నాపేరు విద్యానిధి. నాకు నీ కన్న పిన్నవయస్కులగు నల్గురు కుమారులున్నారు. కాని వారిలో ఎవరూ నా వద్దలేరు. రెండు దశాబ్దముల క్రితం నీవు గద్దెనెక్కిన నాడే ఆ నల్గురు "మేము అడివికిపోయి తపస్సు చేసుకుంటాము" అని నన్నూ నా భార్యనూ వదలి వెళ్లిపోయారు. "పెళ్లి చేసుకొని పిల్లల్ని కనడానికి బదులు ఈ తపస్సు దేనికి? అవసానదశలో మమ్మల్ని చూసే వారెవరు? మా ఉదరపోషణార్థం అవసరమైన ధనధాన్యాదులిచ్చే వారెవరు?" అని నేను ఆందోళనను వెలిబుచ్చగా వాళ్లు, "తండ్రీ, మీకు వయోభారం పైబడినప్పుడు రాజు బ్రహ్మదత్తుని దర్శించి, ఆయనకు ఈ తాళపత్రాన్ని చూపించండి. మీకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఆయన చేస్తాడు అంటూ ఈ తాటాకును నా చేతిలో పెట్టి నిష్క్రమించారు" అన్నాడు.

రాణి సన్నుతీదేవి ఆ తాళపత్రాన్ని అందుకొని దానిపై లిఖించిన శ్లోకాన్ని చదివింది.

"సప్తవ్యాధాద శార్ణేషు, మృగాః కాలం జరగిరౌ,
చక్రవాకాః శరద్వీపే, హంసాస్సరసి మానసే
కోపిజాతాః కురుక్షేత్రే బ్రాహ్మణా వేదపారగాః
ప్రస్థితా దీర్ఘ మధ్వానం యూయంతేభ్యో వసేదధా"

విదుషీమణియగు రాణి ఆ శ్లోకమందలి భావాన్ని ఈ విధంగా వివరించింది.

"మనము ఏడుగురమూ కురుక్షేత్రానికి చెందిన బ్రాహ్మణులం. వేదపండితులం. తర్వాత దశార్ణదేశమున కిరాతులుగనూ, కాలంజరమును గిరియందు మృగాలుగా, శరద్వీపమున చక్రవాకాలుగా, మానససరోవరమున హంసలుగా జన్మ లెత్తినాము. మనకు తిరిగి లభించిన ఈ మానవజన్మలో మేము ముందుకు సాగివచ్చినా, మీరు వెనుకనే ఉండిపోయారు. రండి, వచ్చి మమ్మల్ని కలవండి"

రాణి బ్రహ్మదత్తునితో "ప్రభూ, ఈ శ్లోకంలో రండి అని పిలుస్తున్నవారు ఎవరో, వారు రమ్మంటూన్నది ఎవరినో తెలియడం లేదు" అన్నది. బ్రహ్మదత్తునకు ఆ క్షణంలో తమ గతజన్మలు ఐదూ స్మృతికి వచ్చాయి. గోహత్యా పాతకం ఫలితంగా తాము నాలుగు నీచ జన్మలను లోను కావలసివచ్చినదనీ, పశ్చాత్తాపాలు, తపమూ కారణంగా తిరిగి మానవులుగా పుట్టు భాగ్యము కలిగినదనీ బ్రహ్మదత్తుడు రాణికి వివరించాడు.

"వివేకహీనులమై తుచ్ఛ భోగములను ఆశించి నేనూ నాతరువాతి వారిరువురూ తక్కిన నల్గురితో విడిపోయినాము" అని ముగించాడతడు. అప్పుడాతని కంఠములోగద్గదిక జనించినది. కన్నులనుండి బాష్పములు రాలినవి.

బ్రహ్మదత్తుడు విద్యానిధి దంపతులకు వృద్ధాప్యంలో డబ్బు ఇబ్బంది లేకుండా ధనాన్నీ, సంరక్షణ చేయడానికి పరిచారలకులనూ ఏర్పాటు చేసి ఆయనకు వీడ్కోలు చెప్పాడు.

అనంతరం బ్రహ్మదత్తుడు యువరాజును పట్టాభిషిక్తుని చేసి తాను రాజలాంఛనములన్నిటినీ వీడి వల్కలధారియైనాడు. మంత్రులిరువురూ కూడా ఆ తాళపత్రం వలన ప్రభావితులై పదవులను త్యజించినారు. ఆ అన్నలు ముగ్గురూ ఒక వేకువ జామున నగరాన్ని వీడి విపినమును ప్రవేశించారు. రోజుల తరబడి అడవిలో తిరిగి ఎట్టకేలకు తాము దూరం చేసుకొన్న అనుజులు నల్గురూ వసిస్తున్న ఆశ్రమాన్ని కనుగొనగలిగారు.

000

అనంతరం ఆ అగ్రజత్రయానికి తాము ఏ విధంగా తమ అనుజచతుష్టయానికి వెనుకబడియున్నారో, తెలుసుకోడానికి ఎంతో కాలం పట్టలేదు. నగర జీవితమందలి ఆకర్షణలకు తాము లోనై 'పంచేంద్రియాలు' అనే పొగరుబోతు గుర్రాలు (త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములు) తమ శరీర శకటాలను విచ్చలవిడిగా లాగుకొనిపోయి బోల్తా కొట్టించాయి. 'మనస్సు' అనే కళ్లెం బిగించి ఆ అశ్వాలను అదుపులో పెట్టగల 'బుద్ధి' అనే సారథి తమకు లేకపోయింది! ఆ ఆకర్షణల ప్రమాదాన్ని తప్పించుకొనుటకే తమ అనుజులు నల్గురూ వనవాసాన్ని ఎన్నుకొని, కృతార్థులై, తమకిప్పుడు మార్గదర్శకులయ్యారు.

వారు సత్కర్మలను మాత్రమే చేశారు. అవన్నీ నిష్కామకర్మలు. 'నిష్కామకర్మ' అనగా ఫలితాన్ని ఆశించకుండా చేసినది ఫలితం కోరి చేస్తే ఆ ఫలితాన్ని అనుభవించడం కోసం మళ్లీ జన్మనెత్తాలి. వారు సాధింపవూనినది మోక్షము. 'మోక్షం' అనగా పునర్జన్మల నుండి విముక్తి. నిష్కామ కర్మాచరణము ద్వారా వారికా విముక్తి లభించినది. ఆయువు చెల్లుటతోనే తనువులను విడిచినారు కైవల్యము (మోక్షము)ను పొందినారు.

**(గార్గ్య శిష్యుల గాథ మత్స్యపురాణములోనిది)**

